క్లుప్తంగా

అభివృద్ధికి నిధులు కేటాయించండి

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధిక నిధులు కేటాయించా లని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పాలకుర్తి నియోజవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి లు కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, నియోజవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని సీఎం హామీ ఇవ్వడంతో రేవంత్‌రెడ్డికి యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

జనగామ రూరల్: పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఏటీడీఓ రూపాదేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతిగదులను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులు పలు సమస్యలను రూపాదేవి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతిలో 100% ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎం లచ్చిరాం, స్టాఫ్ సెక్రటరీ వాసు, రతన్ సింగ్, జయరాం, రాములు పాల్గొన్నారు.

రామన్న నాయక్‌కు డాక్టరేట్



దేవరుప్పుల: మండలంలోని పడమటి తండాకు చెందిన జాటోత్ బిచ్యా-హస్లీ దంపతుల కుమారుడు రామన్న నాయక్ పేదరికాన్ని జయించి డాక్టరేట్ పొందడంపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బాల్యం నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించిన రామన్న ఉన్నత చదువులకై పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తిచేశారు. డాక్టరేట్ సాధించాలనే సంకల్పంతో ఉస్మానియా యూనివర్సిటీ రసాయన విభాగంలో చేరారు. డాక్టర్ కె. శివకుమార్ ఆధ్వర్యంలో రసాయన శాస్త్రం అనే అంశంపై పరిశోధనలు పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందారు. రామన్న నాయక్ చేసిన పరిశోధనలు విజయవంతంగా ముగిసినందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ పట్టాను అందించారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీలు ధ్వంసం

రఘునాథపల్లి: మండలంలోని కోమాళ్లలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. గత నెల కోమళ్ల గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవుతున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఫ్లెక్సీలను తగులబెట్టడంతో పాటు మరో రెండు చోట్ల చింపి వేయడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు తాటికొండ వెంకటేశ్ యాదవ్ సోమవారంపోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బచ్చన్నపేట: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని చిన్నరామన్‌చర్లలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గుండ మల్లేశం (32) గ్రామంలో తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం, గేదెలను పెంచుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామంలోని బీరప్ప ఆలయం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య హేమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఆస్పత్రికి తరలించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు ఆశోక్, ఇల్లందుల సురేందర్ బాబు, పరశురాం, సుమన్, శంకర్, లావణ్య, రజిత, సంధ్యారాణి, సుష్మా పాల్గొన్నారు.

శునకం కనిపిస్తే వణుకు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు
● ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



గుంపుగా వస్తున్న కుక్కలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు జంటపట్టణమైె శివునిపల్లిలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. జంట పట్టణాల్లో ఏ గల్లీలో చూసినా గ్రామ సింహాల సమస్య అధికంగా ఉంది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేని తనం ప్రజలకు శాపంగా మారుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల సమస్య ఇటీవల తీవ్రంగా మారింది. ప్రధానంగా ఘన్‌పూర్ ముదిరాజ్ కాలనీ, పీహెచ్‌సీ ఏరియా, ఎస్సీ కాలనీ, బస్టాండ్‌ఏరియా, శివునిపల్లి ఆరవ వార్డు, జూనియర్ కళాశాల ఏరియా, వివేకానంద చౌరస్తా, ఎస్సీ కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. గతంలో పలువురు కుక్క కాటుకు గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. కుక్కల సమస్యపై ఆయా గ్రామాల ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టింపులేకుండా పోతుంది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు కుక్కల సమస్యతో బాధపడుతున్నారు. అదేవిధంగా వివిధ పనులపై వెళ్లి రాత్రి వేళల్లో ఇంటికి వచ్చే వాహనదారులకు కుక్కల బెడద తప్పడం లేదు. కుక్కల దాటికి ద్విచక్రవాహనాలపై నుంచి పడి పలువురు గతంలో రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. కుక్కల సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి



ఇప్పగూడెంలో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. గతంలో పలువురు కుక్క కాటుకు గురైన బాధితులున్నారు. కుక్కల సమస్య నివారణకు పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- లింగనబోయిన శ్రీనివాస్, ఇప్పగూడెం

విద్యార్థులకు ఇబ్బంది



డివిజన్‌కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. కుక్కల బెడదతో పాఠశాలకు కాలినడకన వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల సమస్యపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలి.

- కొలిపాక సతీష్, స్టేషన్‌ఘన్‌పూర్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కళాకారులు

నర్మెట: తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక కళాజాత కళాకారులు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని హన్మంతాపూర్, ఆగపేట, మచ్చుపహాడ్‌లలో సోమవారం ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనగామ శంకర్, పినమల సాంబయ్య, ఎడవెల్లి విజయ, బొమ్మెర రవి, ముక్కెర సంపత్, గడిపె బాలయ్య, బావండ్లపల్లి చిరంజీవి, తిప్పరి శ్రీనివాస్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

పాలకుర్తి: ప్రజా పాలన విజయోత్సవాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పథకాలపై టీంలీడర్లు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టగల్ల సంజీవ, టీమ్ లీడర్ పిన్నింటి రత్నం, బానోత్ గణేష్, కేమిడి కనకరాజు, పన్నీరు శ్రీనివాస్, స్వప్న, రంజాన్, మమత పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యాశాఖ సమగ్రశిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గోరంట్ల యాదగిరి, పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 15 రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాల కోసం సమ్మె నోటీసును సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ కొమురయ్యకు అందించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు లవన్, రమేష్, శ్రీలత, రామతులసి, సునీత, సంధ్య, జ్యోతి, వెంకటస్వామి, రమాచంద్రశేఖర్, శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీపీఎంను ఆదరించాలి



జనగామ రూరల్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కనకారెడ్డి తదితరులు

● సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: అనునిత్యం పేద ప్రజల పక్షపాతిగా ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేస్తున్న సీపీఎం పార్టీని ప్రజలందరూ ఆదరించాలని పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఈనెల 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలకు సంబంధించి మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో కనకారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో సీపీఎం పార్టీ పలు ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని, ప్రజల పక్షపాతిగా అనునిత్యం పనిచేస్తుందన్నారు. ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యాకయ్య, కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, ఐలయ్య, మహేందర్, సోమయ్య, కిష్టయ్య, రాజు, రాములమ్మ, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

జనగామ రూరల్: ఈనెల 27 28 తేదీల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మహాసభల కరపత్రాలను జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి,అహల్య సింగారపు రమేష్ ,శేఖర్ , ఉపేందర్,వెంకట మల్లయ్య, సురేష్, సౌందర్య, ఓద్య నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యాదవసంఘం, గౌడ సంఘం నాయకులు సోమవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని అతని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో యాదవ సంఘం భవనానికి రూ.10 లక్షలు, గౌడ సంఘం భవనం కోసం రూ.10లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేయడం జరిగింది. ఈ మేరకు యాదవ, గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ చెవుల యాదగిరి, గ్రామ అధ్యక్షుడు మెరుగు కుమారస్వామి, గౌడ సంఘం అధ్యక్షుడు బూరు ఎల్లేష్‌గౌడ్, బూరు నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు అబద్ధాలు.. 66 మోసాలు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి



చార్జ్ షీట్ పత్రాలు విడుదల చేస్తున్న దశమంతరెడ్డి

జనగామ రూరల్: కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ చార్జ్ షీట్ విడుదల చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. మేనిఫెస్టోలోని హామీలను నెరవేరుస్తామని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏ ఒక్క గ్యారంటీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. నిరంకుశ పాలనకు స్వస్తి పలికి ప్రజాస్వామిక పాలన అందిస్తామన్నారని, లగచర్లలో భూసేకరణ పేరిట రైతులపై అక్రమ కేసులు పెట్టి పోలీసులచే దాడులు చేయడం ప్రజాస్వామ్య పాలనా అని విమర్శించారు. విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ లేక అవస్థలు పడుతున్నారని, జనగామ నుంచి నర్మెట, హుస్నాబాద్‌కు వెళ్లే దారి వర్షానికి కొట్టుపోయిందని, చేర్యాల రెవెన్యూ డివిజన్ ఎమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉడుగుల రమేష్, సౌడ రమేష్, కొంత శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు



పాలకుర్తి టౌన్: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలకుర్తి టౌన్: ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో సోమవారం మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్, ప్రగతి, సిద్ధార్థ విద్యాయలంలో క్రీడాలను ఎంపీడీఓ రాములు, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ప్రారంభించారు. కార్యక్రమంలో కార్మెల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ లిసెబ్బత్, ప్రగతి, సిద్ధార్థ ప్రిన్సిపాల్‌లు వీరమానేని వెంకటేశ్వర్‌రావు, జక్కుల రవీందర్, పీఈటీలు దేవేందర్, శ్రీనివాస్, రానా, వేణు.హమీద్, రవి, ఆరిఫ్ పాల్గొన్నారు.

చిన్నపెండ్యాలలో..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల స్థాయి క్రీడలను నిర్వహించారు. పోటీలను ఎంఈఓ దాసరి గోవర్ధన్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కార్ స్కూళ్లకు వన్నెతెచ్చేలా వేడుకలు

దేవరుప్పుల: సర్కార్ స్కూళ్లకు వన్నెతెచ్చేలా పాఠశాల యాజమాన్య కమిటీలు తోడ్పాటు అందించాలని ఎంఈఓ కళావతి సూచించారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా విద్యార్థులు అభ్యున్నతి కోసం తల్లుల ప్రత్యేక సమావేశం, విద్యార్థులకు క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు రూ.5 వేల వ్యయంతో పుస్తకాలు అందించారు. ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ శోభ, ఉపాధ్యాయులు రజనీకాంత్, రాజనారాయణ, సత్యనారాయణ, ఆనంద్ ప్రసాద్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు, వారసులు

జనగామ: ప్రభుత్వ నిబంధనల మేరకు వయసు 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ ప్రతినిధి సీహెచ్.శివకుమార్ డిమాండ్ చేశారు. న్యాయమైన హక్కులు సాధించుకునేందుకు సోమవారం జిల్లా నలుమూలల నుంచి వీఆర్‌ఏలు, వారసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో వీఆర్‌ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని, ఆ మేరకు అమలు చేయాలని నెలరోజులు సమ్మె చేయగా ప్రభుత్వం చర్చలు జరిపి జీఓ 81, 85 తెచ్చిందన్నారు. రాష్ట్రంలోని 20,556 మంది వీఆర్‌ఏల్లో విద్యార్హతను బట్టి 16,768 మందికి వివిధ శాఖల్లోని ఖాళీల్లో సర్దుబాటు చేసిందని, మిగిలిన 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాన చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలు, వారసులు మహేష్, బాలరాజు, రాజు, రవి, కనకయ్య, కనకలక్ష్మి, అబ్బ య్య, నాగజ్యోతి, మధుసూదన్, మహేందర్, సతీష్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

● గొల్ల కురుమలు



చిల్పూరు: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/నర్మెట/దేవరుప్పుల/లింగాలఘణపురం: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని జీఎంపీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నర్మెట, స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గొల్లకురుమలు నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పులిగిల్ల రాజు, మేకల మల్లేశ్, బోళ్ల రాజ్‌కుమార్, కర్రె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లింగాలఘణపురంలో..

యాదవులు రాజకీయాల్లో రాణించాలి

● యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సిద్దిరాజ్ యాదవ్



అభివాదం చేస్తున్న నాయకులు

పాలకుర్తి టౌన్: యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక, విద్యా రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బనుక సిద్దిరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో యాదవుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిరాజ్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు గొప్ప చరిత్ర ఉందని అన్నారు. గ్రామాల్లో యాదవులు సంఘటితమైన రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ఉండాలని అన్నారు. చిలువేరు కృష్ణమూర్తి, పాండు కృష్ణ, బెల్లి దేవేందర్,సలేంద్ర శ్రీనివాస్, సంగి వెంకన్న,సూడిద వీరన్న, సలేంద్ర వెంకటయ్య, సోమన్న, బెల్లి యుగేందర్ పాల్గొన్నారు.

పనుల వివరాలు తెలపండి

● డీఆర్‌పీ శిరీష



వివరాలను నమోదు చేసుకుంటున్న శిరీష

బచ్చన్నపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన వారు వివరాలను తెలపాలని డీఆర్‌పీ శిరీష అన్నారు. సోమవారం బండనాగారంలో జీపీ వద్ద ఈజీఎస్ గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ 2023-24వ సంవత్సరానికి గ్రామంలో చేసిన ఈజీఎస్ పనుల వివరాలను తెలిపారు. పనుల్లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాన్నారు. ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ పల్లపు రామకృష్ణ, కారోబార్ శ్రీనివాస్ ఉన్నారు.

కడియంపై ఆరోపణలు మానుకోవాలి

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఉద్దేశ్యపూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాజయ్య తీరుపై మండిపడ్డారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక రాజయ్య మతిభ్రమించినట్లు చీటికిమాటికీ కడియంపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, ఇప్పటికైనా రాజయ్య తన వైఖరిని మార్చుకోవాలని, లేనిపక్షంలో సహించేది లేదని ఆయన హెచ్చరించారు. మాజీ ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్, నాయకులు గాదెపాక బాబు, దేవేందర్, గొట్టె భాస్కర్ పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

● డాక్టర్ వి.రఘుబాబు



మందులు అందజేస్తున్న జిల్లా సహాయ సంచాలకుడు నర్సయ్య

జనగామ రూరల్: పాడి రైతులు పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కార్య నిర్వహణ అధికారి డాక్టర్ వి.రఘుబాబు అన్నారు. మండలంలోని పెద్దపహాడ్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దూడలకు విధిగా నట్టల నివారణ మందు వేయాలన్నారు. అనంతరం డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ 30పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసి మందులు అందజేశారు. శిబిరంలో జిల్లా సహాయ సంచాలకుడు వై.నర్సయ్య, జిల్లా మ్యాక్స్ సొసైటీ అధ్యక్షుడు జె.జనార్దన్‌రెడ్డి, సీహెచ్ ఉపేందర్‌రెడ్డి, విజయ డెయిరీ అధ్యక్షుడు రాజు, రైతులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవోజీతండాలో సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ముడిక అనేష్ మాట్లాడుతూ పశువులకు లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడ దూడలు మాత్రమే పుడుతాయని, దీన్ని పాడి రైతులు సద్వినినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించి రైతులకు ఉచిత మందులు అందజేశారు. ఫయాజ్, గోపాల మిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్, గోపాల మిత్రలు ఆయాస్, రజాక్, జగ్గమల్, సిబ్బంది నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇందిరను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ మల్లన్న

స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరను హైదరాబాద్‌లో ఆమె నివాసంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లన్నకు ఇందిర పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

సన్మానం

దేవరుప్పుల: మండల పరిషత్ పంచాయతీ విస్తీర్ణాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న టి.సురేష్‌కుమార్‌ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. జిల్లా టీఎస్‌జీటీఏ నూతన కార్యవర్గంలో ఈసీగా నియమించి సన్మానం పొందడంపై మండల యంత్రాంగం హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని కస్తుర్బా పాఠశాలలో ఇంగ్లిష్, జీవశాస్త్రంలో బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెస్ స్వప్న తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో ఇంగ్లిష్, జీవశాస్త్రం పాఠాలు బోధించేందుకు అర్హత కలిగిన మహిళా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 4వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అయ్యప్ప పడిపూజ

బచ్చన్నపేట: గురుస్వామి నేతృత్వంలో ఆర్యవైశ్య సంఘ నేతలు జిల్లా రాజేశ్వర్, సందీప్‌లు మహాపడి పూజ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టదళ కలశాలతో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం చేశారు.

నియామకం

చిల్పూరు: గోపా (గౌడ అఫిషియల్స్‌అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మండల కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా చిల్పూరు గుట్టకు చెందిన మూల సంపత్‌గౌడ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయగౌడ్ సోమవారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా రంగు హరీష్ (శ్రీపతిపల్లి), సభ్యులుగా మధుసూదన్, దేవేందర్, యాదగిరి, అజయ్‌లు ఎన్నికయ్యారు.

17న వాహనాల వేలం

జనగామ రూరల్: తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈనెల 17వ తేదీన వేలం వేయనున్నట్లు ఆర్టీఓ సోమవారం ఒక ప్రటకలనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ధరావత్తు సొమ్ము ముందుగా చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

నివాళి

కొడకండ్ల: మొండ్రాయి జీపీ కార్మికుడు దొపాటి కొండయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల అధ్యక్షులు రాంచందర్, పెట్లోజు వెంకటేశ్వర్లు, నాయకులు మృత దేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చెరువు దురాక్రమణపై ఫిర్యాదు

దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లెలోని ముత్యం చెరువు దురాక్రమణపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు, ఆయకట్ట రైతులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్, స్థానిక తహసీల్ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన ఆహారం అందించండి

● బీఆర్‌ఎస్ నాయకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

నర్మెట: విద్యార్థినులకు నాణ్యమైన. పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో గురుకుల బాటలో భాగంగా సోమవారం మండలంలోని హాస్టళ్లలో భోజన వసతులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కోతి విజయారావు, గదరాజు చందు, బీఆర్‌ఎస్వీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి ప్రభాకర్ తెలిపారు. పదినెలల కాలంలో కల్తీఆహారంతో సుమారు 48 మంది విద్యార్థులు మృతి చెందినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. వసతిగృహాల్లో వసతుల లేమిపై బీఆర్‌ఎస్ పోరాడుతుందన్నారు. విద్యార్థినులు సమస్యలుంటే తమదృష్టికి తేవాలని, వారి పేరును గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడు సురేష్, మాజీ ఎంపీపీ గోవర్ధన్, మాజీ సర్పంచ్‌లు పావని జయరాం, కమలాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శౌరథ్, మండల అధ్యక్షుడు ఎలబోయిన నరేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

దేవరుప్పుల: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సందర్శనకు వెళ్లకుండా పోలీసులచే కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు పందెన బోయిన మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలల సందర్శనలో భాగంగా బీఆర్‌ఎస్వీ నాయకులు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. నవీన్ నాయక్, రమేశ్, భారత్, మెడ రాందయాకర్ పాల్గొన్నారు.